ఈనాడు వైయస్ఆర్

మంగళవారం అక్టోబరు 15, 2024

వైద్యవృత్తిలో సేవాభావం అవసరం



వైద్య విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: వైద్య సేవకు అంకితం కావాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదల, సేవా భావం కలిగి ఉండాలని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అన్నారు. స్థానిక వైద్య కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం వైద్య విద్య విద్యార్థులకు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి ఆహ్వానం పలికారు. వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రతి రోజూ అధ్యాపకుల సూచనలతో విద్యను అభ్యసించాలని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యాయామం, ధ్యానం తప్పనిసరిగా చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వసతిగృహం వార్డెన్ డాక్టర్ సునీల్, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో బస్టాండు కిటకిట

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా సెలవులు సందర్భంగా స్వస్థలాలకు వచ్చిన వారందరూ తిరుగు ప్రయాణం కావడంతో కడప ఆర్టీసీ బస్టాండు సోమవారం కిటకిటలాడింది. విజయవాడ, హైదరాబాదు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులతో నిండిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. రద్దీ పెరిగే కొద్దీ మరిన్ని బస్సులు నడుపుతామని చెప్పారు. బెంగళూరుకు 20 బస్సులు, హైదరాబాదుకు 15, చెన్నైకు 5, విజయవాడకు 10, వివిధ జిల్లాలకు 25 అదనపు బస్సులను ఏర్పాటు చేశారు.



ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ ప్రాంగణం

మద్యం దుకాణాలకు అతివల పోటీ

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- కడప నేర వార్తలు



మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ శివశంకర్, చిత్రంలో జేసీ అదితిసింగ్, అబ్కారీశాఖ డిప్యూటీ కమిషనరు జయరాజు

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి అయింది. లాటరీ ద్వారా 139 దుకాణాలను కలెక్టర్ శివశంకర్, జేసీ అదితిసింగ్, అబ్కారీశాఖ అధికారులు కలిసి కేటాయించారు. లాటరీలో మహిళలు కొన్ని దుకాణాలు దక్కించుకోవడం విశేషం. నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సన్నపురెడ్డి సుజల మూడు దుకాణాలను దక్కించుకున్నారు. కడప నగర దుకాణాలు ఉత్కంఠ భరితంగా సాగింది. ఆరంభం నగర దుకాణాల నుంచి ప్రారంభమైంది. తమ అనుచరులతో తరలివచ్చిన పలువురు నేతలు తమకు దుకాణం కేటాయింపు జరగడంతో ఆనందంతో చప్పట్లు కొట్టడం కనిపించింది. కొందరైతే తెలివితేటలు ప్రదర్శించి ఒకే దుకాణానికి పలు దరఖాస్తులు చేసి దక్కించుకున్నారు. ఈ మేరకు పాలగిరి హరికుమార్‌రెడ్డి, జకీర్ హుస్సేన్ ప్రయోగం ఫలించింది. కడపలోని కీలక నేతలు, తెదేపా, జనసేన నేతలు పలు వరించాయి. ఓ టీవీ ఛానల్ తరఫు ప్రతినిధులు దరఖాస్తు చేసి కమలాపురంలో నాలుగు దుకాణాలు కైవసం చేసుకున్నారు. మహిళలు దక్కించుకున్న దుకాణాల్లో జమ్మలమడుగులోని 58వ నంబరు, మైలవరంలో 65, మైదుకూరులో 111ను సన్నపురెడ్డి సుజల, సిద్దవటంలో 31ని కవిత, వేంపల్లెలో 96ను రాజుల గంగాదేవి, 97వ నంబరు దుకాణాన్ని సింగారెడ్డి సరస్వతి దక్కించుకున్నారు. ఓ చానల్ ప్రతినిధులు కమలాపురంలో తక్కువ దరఖాస్తులు దాఖలు చేయడం గుర్తించి చివరి నిమిషంలో ఆన్‌లైన్ దరఖాస్తు చేయగా... ఆ నియోజకవర్గంలోనే 4 దుకాణాలను దక్కించుకున్నారు. అబ్కారీ స్టేషన్ పరంగా చూస్తే కడపలో 1 నుంచి 30, 31 నుంచి 38 వరకు సిద్దవటం, 39 నుంచి 52 ఎర్రగుంట్ల, 53 నుంచి 66 జమ్మలమడుగు, 67 నుంచి 85 ప్రొద్దుటూరు, 86 నుంచి 101 వరకు పులివెందుల, 102 నుంచి 108 ముద్దనూరు, 109 నుంచి 124 మైదుకూరు, 125 నుంచి 139 వరకు బద్వేలు స్టేషన్ పరిధిలో దుకాణాలున్నాయి. జిల్లాలోనే అత్యధికంగా మైదుకూరులోని 124వ దుకాణానికి 53 దరఖాస్తులు వచ్చాయి. కడప పరిధిలోని 27, 28కు 5 చొప్పున దరఖాస్తులు అందాయి. జిల్లాలో పలు చోట్ల సిండికేట్ వ్యవహారాలు సాగుతున్నాయి. కార్యక్రమాన్ని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, పర్యవేక్షణాధికారి రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్, సీఐ కృష్ణకుమార్ నిర్వహించారు.

జెన్‌కో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు సోమవారం డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... కార్మికుల్లో అనేక మంది సుమారు 15 ఏళ్లుగా అతి తక్కువగా జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి విద్యార్హత ఉన్నా అన్‌స్కిల్డ్ వేతనాలే ఇస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఇతర విద్యుత్తు సంస్థలతో పోలిస్తే ఏపీ జెన్‌కో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల గ్రేడ్‌లో మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మేసిన మేఘం

అధికార యంత్రాంగం అప్రమత్తం
తీవ్ర రూపం దాల్చనున్న తుపాను
మరో నాలుగు రోజులు ఉపద్రవమే!

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జిల్లాను వణికిస్తోంది.. ఇది పశ్చిమ వాయువ్య దిశగా వెళ్తోంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. సోమవారం నుంచే జల్లులు మొదలయ్యాయి. పొంచి ఉన్న ముప్పుతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ శివశంకర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు.

కమలాపురంలో నేలకొరిగిన వరి



- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప

జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం సమీక్షించాలని సూచించారు. వర్షపు నీరు రహదారులు, వంతెనలపై ప్రవహించే పక్షంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సిబ్బందిని కాపలాగా ఉంచాలని ఆదేశించారు. వర్షాలతో తాగు నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. బలమైన గాలులు, వర్షాల కారణంగా విద్యుత్తు అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే పునరుద్ధరణ చేసుకోవాలన్నారు.

వరి రైతుల్లో అలజడి

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న జడివానతో వరి సాగు చేసిన రైతుల్లో అలజడి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో 29 వేల హెక్టార్లలో సాగైంది. సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పొట్ట, లేత వెన్ను కంకులను దెబ్బతీసే ప్రమాదం పొంచిఉంది. తాలు గింజలు ఏర్పడి దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు నూర్పిడికి సిద్ధంగా ఉన్న పంట కూడా మరింత వర్షం కురిస్తే నేలవాలే పరిస్థితి ఏర్పడింది. కోత కోయడానికి ఇబ్బందులు వస్తాయని కర్షకులు కలవరం చెందుతున్నారు. ఒంటిమిట్ట మండలం నరసన్నగారిపల్లె, దవంతరంపల్లి, గొల్లపల్లి, దర్జిపల్లి, సిద్దవటం మండలంలో సిద్దవటం, జంగాలపల్లి, వెలుగుపల్లి, మూలపల్లి, తదితర గ్రామాలతో పాటు కేసీ కాలువ కింద ఉన్న ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప నియోజకవర్గాల్లోనూ విస్తారంగా వరి సాగైంది. తుపాను ప్రభావంతో పంట చేజారిపోతుందని సాగుదారుల్లో ఆందోళన నెలకొంది.



జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గొడుగులతో వచ్చిన మద్యం కాంట్రాక్టర్లు

ఉద్యాన తోటలకు ఊపిరి : వర్షం ఉద్యాన తోటలకు ఊపిరినిచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలు 55 వేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి. ఇటీవల వరకు నీటి తడులు అందక వాడు ముఖం పట్టాయి. వర్షంతో మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి, పసుపు పంటలకు జీవం వచ్చింది. వాతావరణం చల్లబడటంతో తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందని, పురుగులు దాడి చేస్తాయని, రైతులు అప్రమత్తమై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కడప ఉద్యానాధికారి జ్యోతిర్మయి తెలిపారు.

సిద్దవటంలో అత్యధికం

జిల్లా సచివాలయం: అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు పడింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సన్నని చినుకులు పడుతూనే ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. సిద్దవటంలో అత్యధికంగా 29.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, ఒంటిమిట్టలో 10.8, బి.మఠంలో 10.2, గోపవరంలో 12.2, అట్లూరులో 20.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

జాతీయ రహదారి... మడుగులా మారి



ఈ చిత్రం చూస్తున్నారు కదా... ఓ మోస్తరుగా వర్షం కురిస్తే చాలు కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ఒంటిమిట్ట హరిత హోటల్ వద్ద వాన నీరు నిలుస్తోంది. ఒంటిమిట్ట నుంచి రాజంపేట వైపునకు వెళ్లే సమయంలో రోడ్డుకు ఎడమ వైపున నీటితో నిండిన ఈ ప్రాంతం మడుగును తలపిస్తోంది. పెద్ద వాహనాలు లారీలు, బస్సులు వెళ్లేటప్పుడు చక్రాల నుంచి నీరు పైకి ఎగిరి అటువైపు వస్తున్న ద్విచక్ర వాహనదారులు, బాటసారులపై పడటంతో బాగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఎన్.హెచ్ సాంకేతిక నిపుణుల దృష్టికి వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సోమవారం కురిసిన వానతో నిలిచిన నీటి చిత్రమిది. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇది 24 గంటలూ పనిచేస్తుంది.

చరవాణి : 08562- 246344

హైదరాబాద్‌కు టిక్కెట్టు రూ.5 వేలు!

యథేచ్ఛగా ప్రైవేటు ట్రావెల్స్ పండగ దోపిడీ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప నుంచి హైదరాబాదుకు సాధారణంగా ప్రైవేటు బస్సు టిక్కెట్టు ధర రూ.1000 లోపే ఉంటుంది. పండగ సీజన్‌లో అది రూ.2000 వరకు వెళుతుంది. అయితే ఇప్పుడు ఏకంగా రూ.5 వేలు చేశారంటే వారి దోపిడీ ఎలా ఉందో అర్థమవుతోంది. కడప నగరానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాదుకు వెళ్లేందుకు సోమవారం ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు సంబంధించిన చార్టును ఆన్‌లైన్‌లో చూడగా ఒక్కో టిక్కెట్టు రూ.5 వేలు అని ఉంది. ప్రైవేటు ఆపరేటర్లు బహిరంగంగా ప్రయాణికులను దోచుకుంటున్నా అరికట్టాల్సిన రవాణాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అత్యవసరమున్న వారు తప్పని పరిస్థితుల్లో రూ.5వేలు పెట్టి వెళ్తున్నారు. పండగ రద్దీ మంగళవారం కూడా కొనసాగనుంది. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు స్పందించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పనులన్నీ వంకర... దారంతా కంకర



రాయలసీమ జిల్లాలకు కేంద్రం మైదుకూరు పురపాలక సంఘ పరిధిలో ఉన్న శాంతినగర్‌లో ఏడాదిగా ప్రజలు నరకయాతన పడుతున్నారు. గత వైకాపా పాలనాలో సిమెంట్ రోడ్డు వేసేందుకు కంకర పరిచారు. ఏడాది అవుతున్నా సిమెంట్ రోడ్డుకు నోచుకోలేదు. కొన్ని వీధులకు సిమెంట్ రహదారులు వేశారు. మరిన్ని వీధులు వేయాల్సినవి ఉన్నాయి. కంకర దారిలో రాకపోకలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు మాత్రం నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలి. ఈ విషయమై కమిషనర్ ఎం.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా

సాంకేతిక శిక్షణ, తక్కువ వడ్డీకే రుణాలు
ఆహార ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు తోడ్పాటు

జిల్లా వివరాలివి...

- ఎస్‌హెచ్‌జీలు : 27,622
- సభ్యులు : 2,82,526
- గ్రామ సమాఖ్యలు : 1,122
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యం 150
- అందించే రుణం : రూ.5 లక్షలు
- పరపతి లక్ష్యం : రూ.7.50 కోట్లు

కడప, న్యూస్‌టుడే: అతివలు ఆర్థిక సాధికారిత సాధించాలని సంకల్పంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకొంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆహార ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ఔత్సాహిక అతివలకు అండగా నిలబడాలని ముందుకొచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి అడుగు పెట్టనున్న వనితలను వెన్నుతట్టి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సెర్ప్ ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కేవీకేలో 1,258 మందికి శిక్షణ : గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల స్వయం ఉపాధి కోసం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం తోడ్పాటు అందిస్తోంది. కలికిరిలో కేవీకే ఏర్పాటు చేసినప్పటి నుంచి 12 ఏళ్ల వ్యవధిలో 1,258 మంది మహిళలకు వివిధ రకాల చేతి వృత్తులపై శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దారు. వీరంతా నిరుపేద, మధ్య తరగతి మహిళలు, డ్వాక్రా లాంటి పొదుపు సంఘాల్లో సభ్యులు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక చేయూత కార్యక్రమం ద్వారా వీరందరికీ ఉపాధి లభించనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఎఫ్‌ఎంఈ కార్యక్రమం ద్వారా ఎస్‌హెచ్‌జీలను అనుసంధానం చేస్తే నారీమణులకు మరింత ఆదాయం వస్తుందని ఉన్నత స్థాయిలో చర్చించారు. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలుత ప్రతి గ్రామ సమాఖ్య పరిధిలో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత మండలానికి అయిదు యూనిట్లు నెలకొల్పేలా ప్రణాళికను రూపొందించారు. జిల్లాలో ఎండు ఫలాలు, తీపి పదార్థాలు, చిరు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పొడులు, దోసె, ఇడ్లి పిండి, చపాతీలు, వేరుసెనగ చిక్కీలు, బంగాళాదుంపల నుంచి చిప్స్, పాల పదార్థాల తయారీ, ఉప ఉత్పత్తులను నాణ్యత ప్రమాణాలతో తయారీ చేసే అనుబంధ పరిశ్రమలతోపాటు వ్యాపారం చేయడానికి మక్కువ చూపే అతివలకు ముడి సరుకు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తి సామర్థ్యం, నిల్వపై సాంకేతిక శిక్షణ ఇచ్చి, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించి ఆర్థికంగా భరోసా ఇవ్వనున్నారు. ఇప్పటికే కొంతమంది పొదుపు సంఘాల సభ్యులను ఎంపిక చేశారు.



కొత్తమాధవరంలో మిఠాయి దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు (పాత చిత్రం)

సాయం అందేదిలా...

ఈ జిల్లాలో మండలానికి అయిదు ఆహార ఉత్పత్తుల తయారు చేసే పరిశ్రమలను స్థాపించేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఒక్కో యూనిట్‌కు రూ. అయిదు లక్షల వరకు రుణం ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఔత్సాహిక అతివలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను 150 అందుబాటులోకి తీసుకొచ్చేలా ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఈసారి రూ.7.50 కోట్ల వరకు పరపతి ఇవ్వనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణం పొందిన ఆడపడుచుల నుంచి 13.5 శాతం, స్త్రీ నిధిలో 11 శాతం వడ్డీ రాబడుతున్నారు. అదే పీఎంఎఫ్‌ఎంఈలో పరపతి పొందిన వారి నుంచి 6 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు. ఈ రంగంలోకి అడుగు పెట్టనున్న అతివలను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. నిర్వాహకులు విజయవంతంగా నిర్వహిస్తే మరికొందర్ని కూడా ఇటువైపు నడిపిస్తామని డీఆర్‌డీఏ జిల్లా అధికారి సత్యనారాయణ తెలిపారు. ఆర్థిక సాధికారితకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఆశా కిరణమై ఎంతోమంది ఉపాధికి ఊతమిచ్చి ఎంతగానో తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి అతివలు ముందుకు రావాలని కోరారు. ఆహారశుద్ధి పరిశ్రమ రంగానికి మంచి భవిష్యత్తు ఉందన్నారు.

సాగునీటి పనులకు నిధులొచ్చాయ్

మరమ్మతులకు రూ.4.79 కోట్లు మంజూరు



సింహాద్రిపురం మండలం గురజాల సమీపంలో పీబీసీ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న జమ్ము

జిల్లాలో సాగునీటి పనుల నిర్వహణ, మరమ్మతులకు అవసరమైన నిధులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. జిల్లా నుంచి జలవనరుల శాఖ సాంకేతిక నిపుణులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించి అత్యవసరమైన వాటిని చేపట్టాలని పచ్చజెండా ఊపారు. పులివెందుల బ్రాంచి కాలువ, తెలుగుగంగ, మైలవరం, గండికోట, ఎగువ సగిలేరులో నీటి విడుదలకు ఏర్పాటు చేసిన గేట్లు, తలుపులు సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నాయి. కాలువల్లో పూడిక, జమ్ము పెరగడంతో నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 25 పనులకు రూ.4.79 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఎంఎఫ్) నిబంధనలను అనుసరించి వీటిని చేపట్టనున్నారు. గండికోట జలాశయానికి రూ.72.25 లక్షలు కేటాయించారు. మైలవరానికి రూ.51.40 లక్షలు ఇచ్చారు. అట్లూరు మండలం కమలకూరు ఆనకట్ట గేట్లను పటిష్టం చేయడానికి రూ.10 లక్షలు, బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ స్లూయిస్ బాగు చేయడానికి రూ.25 లక్షలకు అనుమతిచ్చారు. వివిధ కాలువల మరమ్మతులకు నిధులిచ్చారు. ఇవేగాక మరికొన్ని పనులను చేపట్టడానికి అవసరమైన పద్దు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. గత వైకాపా పాలనలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు నిధులివ్వాలని ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యవసరంగా ఏం చేయాలో సమాచారాన్ని సేకరించి నివేదించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పనులను శరవేగంగా చేయిస్తామని జిల్లా సీఈ ఎం.మల్లికార్జునరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, కడప**

లంకమల... అరుదైన విహంగాల ఖిల్లా



కిలకిలరావాలతో సందడి చేసే బుల్లిపిట్టలు పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. గాలిలో, నీటిలో తిరిగే హానికరమైన కీటకాలను, శత్రు పురుగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా వ్యవసాయానికి తోడ్పాటునిస్తాయి. అలాంటి అపురూప ప్రాణుల్లో కొన్ని అంతరించిపోగా మరికొన్ని జిల్లాలోని లంకమల అభయారణ్యంలో సంచరిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి.


- సిద్దవటం, న్యూస్‌టుడే

జిల్లాలో లంకమల అభయారణ్యానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సుమారు 46,442.82 హెక్టార్లలో విస్తరించిన ఈ ప్రాంతంలో సుమారు 300కు పైగా పక్షి జాతులు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. వీటిలో చాలా అరుదైన పక్షిగా నీలి నల్లంచి ప్రత్యేకత సంతరించుకుంది. గతంలో సిద్దవటం రేంజిలోని మచ్చాయకుంట ప్రదేశంలో దీనిని అధికారులు గుర్తించారు. కలివికోడి కూడా 1986లో కనిపించి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చిపెట్టింది. మళ్లీ దీనిని కనిపెట్టాలని అధికారులు ఏళ్ల తరబడిగా పలురకాలుగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. దీనిని పోలిన పక్షులుగా రాతికాలేడు, ఎర్ర చిటవ ఉన్నాయి. మరికొన్ని అరుదైన వాటిలో బంగారు రొమ్ము ఆకు పిట్ట, ఎర్రగొంతు ఈగపట్టు పిట్ట, నీలి ఈగ పట్టు పిట్ట, తోక నల్లంచి, పెద్దఆకురాయి, చారలగొంతు వడ్రంగి పిట్ట, వర్ణ డేగ, అడవి రామదాసు, బుడమాలి గద్ద, జాలి డేగ, నీటి కాకి, తెరపి ముక్కు కొంగ, నల్ల గద్ద, జుట్టు బైరి, తోక పిగిలి పిట్ట, నల్ల తల వంగ పండు, ఎర్ర గువ్వ, కుందేలు సాలవ, పచ్చ గువ్వ, తదితర పక్షులు ఉన్నాయి. ఇక్కడ అరుదైన పక్షి జాతులు ఉండడంతో వాటిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు పరిశోధకులు ఇక్కడకు వస్తుంటారు.

పరిరక్షణకు చర్యలు అవసరం

లంకమల అభయారణ్యం అరుదైన పక్షి జాతులకు నిలయంగా ఉంటోంది. ఇవి జీవవైవిధ్యానికి, మానవుని మనుగడకు పరోక్షంగా సహకరిస్తున్నాయి. వాటిలో చాలావరకు అంతరించి పోతుండగా మిగిలిన వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సాధారణ, అరుదైన పక్షి జాతులను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- మహమ్మద్ హాయత్, పక్షి పరిశోధకులు, కడప



లంకమల అభయారణ్యం

రైతేరాజు 6లో

డ్రాగన్.... దిగుబడి అదిరెన్

లాభాల పంట పండిస్తున్న జమ్మలమడుగు రైతు





వర ప్రసాద్, డ్రాగన్ తోట రైతు, జమ్మలమడుగు

ఉమ్మడి కడప జిల్లాలో ఆధునిక ఉద్యాన పంటగా పేరొందిన డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు తెచ్చి పెడుతోంది. జమ్మలమడుగుకు చెందిన రైతు వరప్రసాద్ ఈ పంటను సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెన్నా నదికి సమీపంలో నాలుగేళ్ల కిందట సుమారు అయిదు ఎకరాల్లో 2 వేల తైవాన్ పింక్ మొక్కలు, 2 వేల అమెరికన్ పింక్ మొక్కలు తెప్పించి నాటారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ప్రస్తుతం పింక్ రకానికి చెందిన డ్రాగన్ ధర కిలో రూ.100 నుంచి రూ.130 పలుకుతోంది ముంబయి, హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు వంటి ప్రాంతాలకు డ్రాగన్ ఫ్రూట్ ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం తైవాన్ పింక్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఎకరానికి రూ.అయిదు లక్షలు పెట్టుబడి పెట్టగా ఖర్చులన్నీ పోనూ రూ.లక్ష ఆదాయం వచ్చిందని.. అయిదు ఎకరాలకు గాను రూ.ఐదు లక్షల మేర లాభం ఆర్జించినట్లు చెబుతున్నారు. ఉద్యాన శాఖ తరపున హెక్టారుకు రూ.50 వేలు రాయితీ ఇస్తున్నామని ప్రొద్దుటూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి భరత్‌రెడ్డి తెలిపారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు

రైతేరాజు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: రబీలో ఉలవ సాగు చేయాలంటే ఎకరాకు ఎన్ని కిలోల విత్తనం కావాలి. ఏ రకం ఎరువులు వేయాలో తెలియజేయండి?

- సి.వెంకట్రామయ్య, రైతు, చింతకొమ్మదిన్నె

సమాధానం : గొర్రుతో వరుసల్లో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు, వెదజల్లే విధానంలో 12-15 కిలోలు విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల నడుమ 10 సెం.మీ దూరం పాటించాలి. అలాగే ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌ను ఇచ్చే పోషకాలను ఆఖరి దుక్కిలో భూమిలో విత్తే ముందు వేసుకోవాలి.

- డాక్టర్ ఎ.వీరయ్య, సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, - కడప, న్యూస్‌టుడే

ఉలవ సాగులో... విత్తనం ఎంపికే కీలకం

రాజంపేట పట్టణం, న్యూస్‌టుడే: ఉలవలో పోషకాలు మెండు... ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. విపణిలో ఏడాది పొడవునా గిరాకీ ఉంటుంది. రైతులు కూడా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో ఆలస్యంగా, రబీలో ముందస్తుగా మెట్ట భూముల్లో సాగు చేయాలని కర్షకులు సన్నద్ధమవుతున్నారు. మేలిమి విత్తనంతో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడి పొందవచ్చునని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఇ.సాయి మహేశ్వరి, డాక్టర్ ఎ.వీరయ్య, డాక్టర్ వి.శిల్పకళ, డాక్టర్ టి.మహేష్‌బాబు సూచించారు.

నేలలు : చల్కా, ఎర్ర, నల్లరేగడి అనుకూలం.

విత్తన రకాలు : పీడీఎం-1: పంట కాలం 105 రోజులు. ఎకరాకు 6-6.5 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. గింజలు బూడిద రంగులో ఉంటాయి.

క్రీడా-18-ఆర్ : పంట కాలం 85-90 రోజులు. ఎకరాకు 5-6.5 క్వింటాళ్లు దిగుబడి రానుంది. గింజలు గోధుమ రంగులో ఉంటాయి. పల్లకు, బూడిద తెగుళ్లను తట్టుకోగలదు.

క్రీడ హర్ష (సి.ఆర్.హెచ్.జి-19) : పంట 85-95 రోజుల్లో ముగుస్తుంది. ఎకరాకు 6-7.7 క్వింటాళ్ల దిగుబడి పొందే అవకాశం ఉంది. గింజలు గోధుమ వర్ణంలో ఉంటాయి. బూడిద, ఆంత్రాక్నోస్ దిడలను తట్టుకొంటుంది.

అనంత ఉలవ (ఏటీపీహెచ్‌జి-II) : పంట కాలం 110-120 రోజులు. ఎకరాకు 6-6.5 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. గింజలు బూడిద, గోధుమ రంగులో ఉంటాయి.

విత్తే సమయం : సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సాగుకు అనుకూలం.

విత్తన మోతాదు: గొర్రు విధానంలో విత్తనం వేయాలంటే ఎకరాకు 8-10 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 12-15 కిలోల విత్తనం సరిపోతుంది.



ఉలవ విత్తనాలు

విత్తే దూరం : వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల నడుమ 10 సెం.మీ ఎడం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి కార్బండిజమ్ 2 గ్రాము కలిపి విత్తనశుద్ధి చేయాలి.

ఎరువులు : ఎకరాకు నత్రజని నాలుగు కిలోలు, భాస్వరం 10 కిలోలు, పొటాష్ 8 కిలోల చొప్పున విత్తనం వేసే ముందు వేసుకోవాలి.

కలుపు నివారణ : విత్తిన 25-30 రోజుల మధ్యలో నేలలో తగినంత తేమ చూసుకుని గొర్రుతో అంతర కృషి చేయాలి. కూలీలతో ద్వారా కలుపు మొక్కలను తీసేయాలి.

కాయ తొలిచే పురుగు : పూత, పిందె ఏర్పడే దశలో పంటను ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది.

నివారణ: క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి అవసరాన్ని బట్టి మందులను మార్చి చేసి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు : వాతావరణంలో అధిక తేమ ఉండి, రాత్రి పగటి ఉష్ణోగ్రతల్లో ఎక్కువ వ్యత్యాసం ఉన్నప్పుడు ఈ తెగులు బాగా వ్యాప్తి చెందుతుంది.

నివారణ: కార్బండిజమ్ గ్రాము లీటరు నీటిలో కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నిర్దేశించిన కాలంలో విత్తుకోవాలి.

వేరుకుళ్లు: తొలుత వేర్లు కుళ్లిపోతాయి. ఆ తర్వాత ఆకులు జీవం కోల్పోయి ఎండిపోతాయి.

నివారణ: పొలంలో తెగులు సోకిన మొక్కల చుట్టూ ఉన్న నేలను కార్బండిజమ్ గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపిన ద్రావణంతో బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

బెండలో ఎరువుల యాజమాన్యం

చిట్కా...

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: బెండ సాగు చేసే రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులను వేసుకోవాలి. చివరి దుక్కిలో ఎకరాకు పశువుల ఎరువు 6-8 టన్నులు, వేపపిండి 100 కిలోలు చొప్పున వేయాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్ 1 కిలో, పి.ఎస్.బి ఒక కిలో, ట్రైకోడెర్మా 2-2.5 కిలోలు సేంద్రియ సత్తువతో కలిపి వృద్ధి చేసి పొలంలో చల్లుకోవాలి. సూక్ష్మ పోషకాల నివారణకు ఎకరాకు ఫెర్రస్ సల్ఫేట్, జింక్ సల్ఫేట్ 8 కిలోలు, బోరాక్స్ 2 కిలోల నాటే సమయంలో వేసుకుంటే మంచిది. భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులు 24 కిలోలను ఆఖరి దుక్కిలో వేయాలి. నత్రజని ఇచ్చే ఎరువును 48 కిలోలను మూడు సమ భాగాలు చేసి నాలుగో వంతు చివరి దుక్కిలో చల్లాలి. మిగిలిన సత్తువను రెండు సమ భాగాలుగా చేసుకుని విత్తిన 30, 45వ రోజు చల్లాలి. సిఫారసు చేసిన రసాయన ఎరువులను విత్తిన వారం రోజుల తర్వాత, ద్రవ రూపంలోని జీవన ఎరువులను బిందు సేద్యం విధానం ద్వారా మొక్కలకు అందించవచ్చు. సంకర జాతి రకాలను మొత్తం దున్ను 50 శాతం అదనంగా వేయాలి. నాటిన 30, 45, 90 రోజులకు 19:19:19 పొటాష్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషక మిశ్రమం 5 గ్రాములు లీటరు నీటికి కలిపి 30, 45వ రోజులకు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. పూత దశలో యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లితే 25 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు. **- మానస, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు**

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: ఎస్పీ



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత ఠాణాలకు బదలాయించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఠాణాలకు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు.

జిల్లా సచివాలయం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శక విచారణ చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, ఎస్డీసీ వెంకటపతి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ పాల్గొన్నారు.

● డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి నలుగురు ఫోన్‌లో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

తుపానుతో అన్ని శాఖలు అప్రమత్తం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: వర్షాకాలంలో ప్రజలు విద్యుత్తు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్తు సరఫరా సంస్థ పర్యవేక్షక ఇంజినీరు రమణ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎక్కడా ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు విద్యుత్తు మోటార్ల దగ్గ చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

విద్యుత్తు కంట్రోల్ రూంల ఏర్పాటు

జిల్లాలో ఉన్న తమ సంస్థ పరిధిలో ఐదు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని ఎస్ఈ తెలిపారు. వీటితో పాటు టోల్‌ఫ్రీ నెంబరు 1912 నెంబరుకు కూడా సమాచారం అందించవచ్చని చెప్పారు.

కంట్రోల్ రూం	ఫోన్ నెంబరు
కడప (విద్యుత్తుభవన్)	94408 17440
కడప డివిజన్	94408 17441
పులివెందుల	94914 31255
ప్రొద్దుటూరు	78932 61958
మైదుకూరు	94928 73325

సాగులో ముందస్తు జాగ్రత్తలు అవసరం

కడప వ్యవసాయం: అల్పపీడన కారణంగా కురుస్తున్న వర్షాలు పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలతో పంటలను కాపాడుకోవచ్చని చెప్పారు. వరిలో నీరు నిలవకుండా బయటకు పంపేందుకు పాదులు ఏర్పాటు చేసుకోవాలని, వర్షం పడే సమయంలో వీలైనంత వరకు పైపాటు ఎరువులు వేసుకోవద్దని సూచించారు. వేరుసెనగ దాదాపు కోత దశకు వచ్చిందని, రైతులు ఇప్పుడు కోయవద్దని, ఒకవేళ కట్టె పెరికి కాయలు కోసినవారు వాటిపైన టార్పాలిన్ పట్టలు కప్పి కాయలు తడవకుండా చూసుకోవాలన్నారు. పత్తి చివరి దశలో ఉందని, వర్షం ఆగిన తరువాత తీత చేపట్టాలని చెప్పారు. కంది పొలంలో నీరు నిలిస్తే గట్లను తెంచి నీటిని బయటకు పంపాలన్నారు.

జిల్లా అగ్నిమాపక శాఖ సిద్ధం

కడప నేరవార్తలు: వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులైనా ఎదుర్కొనేందుకు జిల్లా అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని తొమ్మిది అగ్నిమాపక కేంద్రాల్లోని సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఆర్టీసీ డ్రైవర్లు కూడా నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కాజ్‌వేలు, వంకలు వర్షాలకు ప్రవహిస్తుంటాయని, అలాంటి చోట డ్రైవర్లు ఆలోచించి నడపాలని సూచించారు.

వసతి గృహాల పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప న్యాయవిభాగం: కడప నగరంలోని ప్రకాష్ నగర్, బాలాజీనగర్, కో ఆపరేటివ్ కాలనీల్లోని బీసీ వసతిగృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ సోమవారం పరిశీలించారు. వసతి గదులను, వంటశాలలను, డైనింగ్ హాలు, స్టోర్ రూములను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలంలో సెల్‌టవర్ నిర్మాణం ఆపండి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప శివారులోని సింగపూర్ టౌన్‌షిప్ గృహాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాకపోయినప్పటికీ రాఘవరెడ్డి అనే వ్యక్తి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సింగపూర్ టౌన్‌షిప్ గృహ నిర్వాహకులు చంద్రమౌళీశ్వరరెడ్డి ఆరోపించారు. కడప ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టౌన్‌షిప్‌లో ఉన్న ఖాళీస్థలాన్ని గ్రీన్‌జోన్‌గా ప్రకటించి, వందల సంఖ్యలో మొక్కలు నాటామని, ఇప్పుడు ఆ స్థలాన్ని ఆయన ఎవరికి చెప్పకుండా ప్రైవేటు వారికి సెల్‌టవర్ కోసం కేటాయించడం తగదని చెప్పారు. కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రవికుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి... భార్యకు తీవ్ర గాయాలు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు మండలం ఎత్తిరాజుపల్లె యానాది కాలనీకి చెందిన సంపూరి రవి (25), భాగ్య దంపతులు ద్విచక్ర వాహనంపై సిద్దవటం వెళ్తుండగా అబ్బూసాహెబ్ పేట కూడలి వద్దకు రాగానే సిద్దవటం రోడ్డు వైపు నుంచి వస్తున్న పాల ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపూరి రవి అక్కడికక్కడే మృతి చెందగా భాగ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలియగానే పట్టణ సీఐ రాజగోపాల్ సిబ్బందితో ఘటన స్థలికి చేరుకుని భాగ్యను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాల ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో రోగి బలవన్మరణం

కాశినాయన, రాజుపాలెం: రాజుపాలెం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన గోపిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి (54) అనే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున జ్యోతిక్షేత్రంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఇతను గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతూ ఉండేవాడని నాలుగు రోజుల కిందట జ్యోతి క్షేత్రానికి వచ్చి అక్కడక్కడ తిరుగుతూ ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టుకు వినతి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. గాలి చంద్ర మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును ఈ ఏడాది ఏప్రిల్ 2న అతని పొలంలోనే హత్య చేశారని తెలిపారు. ఈ కేసులో నిందితులైన చిన్న పుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, వీరు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులమని చెబుతూ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి సిట్ వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, వెంటనే వారిద్దరినీ అరెస్టు చేయాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాదుల్లా, గంగాసురేష్ ఉన్నారు.

పీబీఆర్‌కు కృష్ణాజలాల నిలిపివేత

లింగాల, న్యూస్‌టుడే : గండికోట జలాశయం నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా పెంచికల బసిరెడ్డి జలాశయానికి (పీబీఆర్) తరలిస్తున్న కృష్ణాజలాలను ఆదివారం రాత్రి నుంచి నిలిపివేశారు. గండికోటకు ఎగువ నుంచి కృష్ణాజలాల తరలింపును నిలిపివేశారు. జలాశయం సామర్థ్యం 10.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయానికి లక్షల క్యూసెక్కుల్లో వరదనీరు వచ్చే అవకాశం ఉందన్న ముందస్తు అంచనాతో జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపలేదని, పరిస్థితుల ఆధారంగా గండికోట ప్రాజెక్టు నుంచి జలాలు తీసుకుంటామని పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు.

రాయచోటిలో విద్యార్థిని ఆత్మహత్య

రాయచోటి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని (14) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతున్న విషయం కుటుంబ సభ్యులు తెలిసిందనే భయంతో ఆందోళన చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై నరసింహారెడ్డి తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కడప డీఎస్పీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: మూడునెలల అనంతరం కడపకు రెగ్యులర్ డీఎస్పీ బాధ్యతలు స్వీకరించారు. జులై 17 నుంచి అప్పటి డీఎస్పీ షరీఫ్ వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి బాధ్య డీఎస్పీలుగా సుధాకర్, వెంకటరాముడు, రమాకాంత్ వ్యవహరించారు. ఎట్టకేలకు పది రోజుల కిందట వెంకటేశ్వర్లుకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నిఘా విభాగంలో పని చేస్తూ కడపకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ నేరాల కట్టడికి తన వంతు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

జిల్లాలో 77 మంది పోలీసుల బదిలీ

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 77 మంది పోలీసులను బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 14 మంది ఏఎస్సైలు, 19 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 44 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. బదిలీ అయిన వారందరూ కేటాయించిన ఠాణాల్లో రిపోర్టు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పొందేలా ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ అర్హత కలిగి, వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న వారు ఈ నెల 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులకు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఉప సంచాలకులు చెప్పారు.

రైతుబజారులో రాయితీపై నూనెల విక్రయం



నూనె ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: కడప రైతుబజారులో రాయితీపై వంట నూనె విక్రయాలను సోమవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం రాయితీపై 850 గ్రాముల పామోలిన్ ప్యాకెట్ రూ.110, సన్‌ఫ్లవర్ 910 గ్రాముల ప్యాకెట్ రూ.125కు అమ్మేలా చర్యలు చేపట్టింది. ఏఎస్ఓ తారక్‌నాథ్‌రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, ఎంఎల్ఆర్ఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో జాతీయస్థాయి ఉర్దూ సదస్సు

కడప విద్య, న్యూస్‌టుడే : కడపలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నవంబరు 9, 10 తేదీల్లో అంజుమన్‌తరఖ్ఖి ఉర్దూ (ఉర్దూ భాషాభివృద్ధి సంఘం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉర్దూ సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్‌ఫైజీ, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. వివిధ అంశాలపై ఉర్దూ సాహితీవేత్తలు, పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం, ఉర్దూ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల, యూనివర్శిటీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, కవులు, రచయితలు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొంటారని వెల్లడించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు వేళాయె

రేపటి నుంచి ప్రక్రియ ప్రారంభం... నవంబరు 24కు పూర్తి



మైలవరం ప్రాజెక్టు (పాత చిత్రం)

న్యూస్‌టుడే, కడప గ్రామీణ

సాగునీటి కమతాలకు సంబంధించి ఏదేని సమస్యలుంటే పరిష్కరించుకునేందుకు సులువుగా ఉంటుందని గతంలో తెదేపా హయాంలో నీటి సంఘాలను ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటిని పట్టించుకోకపోవడంతో నిర్వీర్యమయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై ప్రత్యేక దృష్టిపెట్టింది. నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. ఈ నెల 16 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 24కు పూర్తి చేయనున్నారు. వైఎస్ఆర్ జిల్లాకు నీటిపారుదల (సర్కిల్) ఎస్ఈ శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లాకు ఎస్ఈ వెంకట్రామయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్నారు.

మొత్తం 206 సంఘాలు

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 206 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వాటిలో వైఎస్ఆర్ జిల్లాలో 112, అన్నమయ్య జిల్లాలో 94 ఉన్నాయి. చెరువుల కింద సంఘాలకు నేరుగా ఆరు టీసీలను ఎంపిక చేసి ఛైర్మన్, ఉపఛైర్మన్‌లను ఎన్నుకుంటారు. అలాగే ప్రాజెక్టుల కింద ఉన్న కాలువల పరిధిలో ఇదే తరహాలో డైరెక్టర్లును ఎన్నుకుని వారిలో ఛైర్మన్, ఉప ఛైర్మన్లను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఆయా ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టుల కమిటీలు ఎన్నికవుతాయి.


ఓటరు జాబితాపై కసరత్తు

సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నెంబర్ల వారీగా జాబితా నవీకరించాలని నీటిపారుదలశాఖ క్షేత్రస్థాయి అధికారులు అక్కడి తహసీల్దార్లకు లేఖలు రాస్తున్నారు. పూర్వం ఆయకట్టు సాగు చేసే రైతులే ఉన్నారా? లేక ఆ భూమి ఇతరుల చేతికి మారిందా? వాస్తవ ఆయకట్టు దారుడెవరనేది వివరాలు సేకరిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అధికారులు లేరో అక్కడ నియమించనున్నాం. ఎలాంటి అవతవకలు లేకుండా ప్రక్రియ పూర్తిచేస్తాం. **- శ్రీనివాసులు, వెంకట్రామయ్య, ఎన్నికల అధికారులు**

తారస్థాయికి చేరిన భూ వివాదం



మాచుపల్లెలో వివాదస్పదంగా మారిన భూమి ఇదే

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం మండలంలోని మాచుపల్లెలో విలువైన ప్రభుత్వ భూమిపై వివాదం తారస్థాయికి చేరింది. ఇక్కడి సర్వే సంఖ్య 100లో సుమారు 28.80 ఎకరాల గుట్ట పరంబోకు భూమి ఉండేది. ఇక్కడ 1.50 ఎకరాల్లో జగనన్న కాలనీ ఏర్పాటైంది. దీని పక్కనే మరో ఎకరం పైగా భూమి చదునుగా ఉండేది. దీనికి ఆనుకుని సర్వే సంఖ్య 99లో 2.78 ఎకరాలు ఉండగా, ఇప్పటికే ఆ భూమి పలువురు చేతులు మారింది. ఈ నేపథ్యంలో సర్వే సంఖ్య 100/1, 100/2లో ఉన్న సుమారు 80 సెంట్లకు పైన పోరంబోకును పక్క భూమి రైతులు ఏడాదిన్నర కిందట ఆక్రమించుకుని, సాగు చేసుకుని కంచె కూడా ఏర్పాటు చేశారు. ఆ 80 సెంట్లలో 59 సెంట్లు గ్రామ అవసరాలకు కేటాయించాలని కొందరు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో ఉన్న మరో 26 సెంట్లు భూమి తనకు చెందినదని, ఆక్రమణలు తొలగించి తనకు కేటాయించాలని రైతు కూడా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏడాదిపైగా వివాదం కొనసాగుతున్నా సమస్య పరిష్కరించలేదు. ఇటీవల రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమిని సర్వే చేసేందుకు రాగా ఫిర్యాదుదారుడు, తహసీల్దారు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. తన భూమిలో రహదారి ఏర్పాటు చేశారని, ఆ స్థలాన్ని తనకు కేటాయిస్తే ఆక్రమించుకున్న భూమిని తిరిగి ప్రభుత్వానికి ఇస్తానని రైతు తేల్చి చెప్పినట్లు సమాచారం. దీంతో వివాదం కొలిక్కి రావడం లేదు. దీనిపై తహశీల్దారు మురాషావలి మాట్లాడుతూ భూ సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఆదరించాలి... ఆదుకోవాలి

● జిల్లాలో పడిపోతున్న హాజరు
● రవాణా భత్యం అందక ఇక్కట్లు

– న్యూస్‌టుడే, బద్వేలు, గోపవరం, రాజుపాళెం

అసలే నిరుపేదలు. ఇంటి నుంచి భవిత కేంద్రానికి ఆటోలో రావాలంటే పోనురాను రూ.200 పైగా ఖర్చు అవుతోంది. ఈ కారణంగా 50 శాతం విద్యార్థులు భవిత కేంద్రాలకు రాలేకపోతున్నారు. వీరిలో కొందరికి పింఛన్ అందడం లేదు. భవిత కేంద్రాల్లో కనీస వసతులు లేవు. తాగునీటికి ఇబ్బందిగా ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో భవిత కేంద్రాలు 51 నడుస్తున్నాయి. 6,000 మంది ప్రత్యేక అవసరాలు కల విద్యార్థులు చదువుతున్నారు. 102 మంది ఉపాధ్యాయులు, 51 మంది ఆయాలు, 51 మంది ఫిజియోథెరపిస్టులు మానసిక, శారీరక వైకల్యం ఉన్నవారికి వైద్య సేవలను అందిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా ఇక్కడకు వచ్చి చదివే వారికి ఎస్కార్టు, రవాణా భత్యం నాలుగేళ్లుగా అందకపోవడంతో హాజరు శాతం ఏడాదికేడు తగ్గిపోతోంది. ఒక్కొక్క భవిత కేంద్రంలో 20 మంది రోల్ ఉండగా హాజరు శాతం వచ్చేసరికి సగానికి సగం పడిపోతోందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఇట్టే అర్థమైపోతోంది. 2012లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి మండలానికి ఒక భవిత కేంద్రం నెలకొల్పి అవసరమైన నైపుణ్యంకల ఉపాధ్యాయులు, ఆయాలను నియమించారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపిస్టు తమ వైద్యాన్ని బాధితులకు అందించే విధంగా ప్రత్యేకంగా నిర్దేశం చేశారు. ఒక్కో ప్రత్యేకావసరాలు కల విద్యార్థికి ఆరు వేల రూపాయలు పింఛను, ఎస్కార్టు రవాణా కోసం రూ.300 అందించేవారు. 2021 నుంచి ఎస్కార్టు రవాణా ఖర్చులకు ఇచ్చేదానిలో కోత విధించి కొందరికే ఇస్తున్నారు. కేంద్రాల్లో ఆర్వో ప్లాంటు నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది. ఈ సమస్యలపై భవిత కేంద్రాల జిల్లా కో ఆర్డినేటర్ కేశవరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.



బద్వేలు భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు

● బద్వేలు కాపువీధికి చెందిన లక్ష్మీదేవి కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భర్త మృతి చెందారు. ఉన్న ముగ్గురు పిల్లల్లో ఇద్దరు కుమారులు రామసుబ్బారెడ్డి, రంగారెడ్డి, కుమార్తె రాజేశ్వరీ ఈ ముగ్గురూ శారీరక, మానసిక వైకల్యంతో ఉన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేయగా ఒకరికి మాత్రమే పింఛను మంజూరైంది. మిగిలిన ఇద్దరికి రావడం లేదు.

● స్థానిక పోరుమామిళ్లరోడ్డు వీధికి చెందిన లక్ష్మీదేవి కుటుంబానికి ఎస్కార్టు, రవాణా భత్యం అందకపోవడంతో భవితా కేంద్రానికి పిల్లలను తీసుకురావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● బద్వేలు పట్టణానికి చెందిన లక్షుమ్మ కుమారుడైన వెంకటరమణకు శారీరక, మానసిక వైకల్యం ఎక్కువగా ఉంది. సదరంలో శారీరక, వైకల్యం శాతం తక్కువగా వైద్యులు ధ్రువీకరణ పత్రంలో నమోదు చేయడంతో పింఛన్‌కు అర్హత లేకుండా పోయింది. ఇదే కారణంగా పింఛనుకు నోచుకోలేక పోయిన వారు అనేక మంది ఉన్నారు.

ప్రొద్దుటూరు

•ప్రొద్దుటూరు •జమ్మలమడుగు •బద్వేలు •మైదుకూరు

పెన్నా నదికి నీటి విడుదల


మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు డీఈఈ ఆనంద నరసింహమూర్తి సోమవారం తెలిపారు. మైలవరం జలాశయం ఉత్తర కాలువకు 90, దక్షిణ కాలువకు 80 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు చెప్పారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 5 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.9 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వర్షాలు పడుతుండడంతో నీరు పెరగవచ్చు అని నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



మైలవరం జలాశయం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

అధికారులు మారినా.. మారని పేర్లు

ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీలు పూర్తయ్యాయి. అధికారులు బాధ్యతలు స్వీకరించి విధుల్లో ఉన్నా బోర్డులపై మాత్రం పాత అధికారుల పేర్లే ఉండడంతో కార్యాలయానికి వచ్చే సందర్శకులు గందరగోళానికి గురవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డుపై గతంలో పనిచేసిన ఎంపీడీవో వెంకట రమణయ్య, పర్యవేక్షణాధికారి పరిపూర్ణ అరుంధతి పేర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎంపీడీవోగా శంషాద్‌బాను, పర్యవేక్షణ అధికారిగా కామేశ్వరరావు కొనసాగుతున్నారు. బోర్డుపై పేర్లు మారలేదని ప్రజలు అంటున్నారు. **-న్యూస్‌టుడే, పెద్దముడియం**



తుపానుపై అప్రమత్తత అవసరం

ఖాజీపేట, న్యూస్‌టుడే: దక్షిణ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన తుపానుపై అప్రమత్తత అవసరమని ఖాజీపేట తహసీల్దారు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మట్టి మిద్దెలను గుర్తించి వారికి ప్రమాదమని తెలిస్తే వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించి వసతి కల్పించాలన్నారు.

డీఎస్సీలో ఉచిత శిక్షణ

మైదుకూరు, బద్వేలు, న్యూస్‌టుడే: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ జిల్లా అధికారి కె.డేవిడ్ ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి, రూ.2.50 లక్షలు ఆదాయం కలిగిన అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈనెల 21వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో 5050 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం నూతన తహసీల్దారుగా గురప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు తెలిపారు.

పారిశ్రామికవాడ... ఏదీ సౌకర్యాల జాడ?

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

ప్రొద్దుటూరు-మైదుకూరు రహదారి పక్కన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఏర్పాటైన రెండు పారిశ్రామికవాడల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం లేదు. తారు, కాంక్రీటు రోడ్లు, కాలువల నిర్మాణాలూ దిక్కులేవు. వర్షాలొస్తే రహదారులపై గుంతల్లో నిలిచిన మడుగులతో పరిశ్రమల నిర్వాహకులు అగచాట్లు పడుతున్నారు. కంకర తేలిన, మట్టి గుంతల్లో ముడి సరకులతో వచ్చే వాహనాల చోదకుల పరిస్థితి వర్ణనాతీతం. వాయు కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు పర్యావరణ పరిరక్షణ చర్యలు లేవు. రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు విస్తరించాయి. ప్రత్యేక విద్యుత్తు ఉపకేంద్రం లేక సరఫరా లోపాలతో కరెంటు అంతరాయం వలన వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు.

తాత్కాలిక పనులతో మమ

1972లో పారిశ్రామికవాడ-1లో 1972లో 18 ఎకరాలు, 2లో 2010లో 40 ఎకరాలను అధికారులు సేకరించారు. ప్రస్తుతం మొత్తం 45 పరిశ్రమలు ఉన్నాయి. అప్పట్లో నాలుగైదు చోట్ల తారురోడ్లు, వంతెనలు ఏర్పాటుతో మమ అన్పించారు. కానీ కాలువల్లేక వర్షపు నీటి, బురద కుంటలతో దెబ్బతిన్న రహదారులపై సింహభాగంలో కంకర తేలిన చోట్ల గుంతలుపడ్డాయి. దోమలు, విష పురుగుల సంచారంతో హడలెత్తిపోతున్నారు. ● గతేడాదిలో రెండు పారిశ్రామిక వాడల్లో రూ.3.80 లక్షల వ్యయంతో మంచినీటి సరఫరాకు పీవీసీ గొట్టాలు ఏర్పాటు చేశారు. దీంతో అడుగంటుతున్న భూగర్భ జలాలు కారణంగా గొట్టపు బావుల సమస్యల నుంచి పరిశ్రమల నిర్వాహకులకు శాశ్వతంగా ఇబ్బందులను తొలగించారు. అంతకు ముందు నుంచి జనకులు, లవణాలు అధికంగా ఉన్నందున తాగేందుకు వీలుండేది కాదు. ప్రస్తుతం కొత్తపల్లె పంచాయతీ మంచినీటి గొట్టానికి అనుసంధానం చేయడంతో రక్షిత నీటి డబ్బాలకు పెడుతున్న ఆర్థిక భారం లేకుండా పోయింది. ● వర్షాలు, వేసవిలో సాంకేతిక సమస్యల కారణంగా కరెంటు సరఫరా తీరు అస్తవ్యస్తంగా ఉంటోంది. వేసవిలో విద్యుత్తు కోతల వలన వారంలో కొన్ని రోజులు పాటు కరెంటు సరఫరా వేళలపై ఆంక్షలు విధించడంతో ఆర్థికంగా వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ● పరిశ్రమల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నులను ఐలా నిధిలోకి జమ చేస్తున్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ సుదర్శన్‌రెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వెలగని వీధి దీపాలకు సత్వరంగా మరమ్మతులు, పిచ్చి మొక్కలు, చెట్లు తొలగింపు పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. గతంలో పంపిన ప్రతిపాదనలకు అధికారుల నుంచి ఆమోదం వస్తే రహదారులు, కాలువలను ఐలా నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. మొక్కలు నాటేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నా.. కానరాని అభివృద్ధి పనులు



కాలువల్లేక గుంతల్లో నిలిచిన నీరు

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

రెండు పారిశ్రామికవాడల్లో తిష్ఠవేసిన వివిధ సమస్యల పరిష్కారానికి ఏపీఐఐసీ అధికారులతో సమన్వయం ద్వారా వివిధ అభివృద్ధి పనులను చేపడతామని కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మెరుగైన పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యమిస్తామన్నారు.



పోగైన వ్యర్థాలతో నెలకొన్న అపరిశుభ్రత

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)

ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: జమ్మలమడుగు నుంచి మైలవరం, పెద్దముడియం తదితర ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలు కురిసినపుడు గుంతల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు రాకపోకలు సాగించేటప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారుల్లో గుంతలను పూడ్చి సమస్యలను పరిష్కరించాలి.
-సూర్యనారాయణ, జమ్మలమడుగు

✓: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపడుతున్నాం. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.
-రామకృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, జమ్మలమడుగు

?: మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల చెంత చెత్త నిల్వలు గత కొన్ని రోజులుగా దర్శనమిస్తున్నాయి. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. చిన్నారులు, విద్యార్థులు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. చెత్త చెదారం సకాలంలో తొలగించడం లేదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
-సునీల్‌కుమార్, గూడెంచెరువు గ్రామం

✓: పారిశుద్ధ్య కార్మికులతో పాఠశాల వద్ద నిల్వ ఉన్న చెత్తను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం.
-సంజీవ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: రాజీవ్‌నగర్ కాలనీలో కొన్ని వీధులకు సిమెంటు రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రాత్రి వేళ దోమలతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
-సంజీవ, రాజీవ్‌నగర్ కాలనీ

✓: సిమెంటు రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. దోమల నివారణకు చర్యలు చేపడతాం.
-సంజీవ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: మండల పరిధిలోని సిరిగేపల్లె గ్రామంలోని ప్రధాన రహదారులపై చెత్తచెదారం నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు చెత్త నిల్వలు లేకుండా చూడాలి.
-బాలకృష్ణ, సిరిగేపల్లె గ్రామం

✓: రహదారులపై చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అవగాహన కల్పిస్తాం.
-గంగన్న, పంచాయతీ కార్యదర్శి
-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

జమ్మలమడుగులో భారీ బందోబస్తు మధ్య కౌన్సిల్ సమావేశం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా పట్టణంలో అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భారీ బందోబస్తు, రెండంచెల భద్రత మధ్య కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ ఏడాది ఆగస్టు 28 తేదీ కౌన్సిల్ సమావేశం నిర్వహించగా కోరం లేక వాయిదా పడింది. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మతోపాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే హాజరుకావడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐ, పోలీసు సిబ్బందితో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. కౌన్సిల్ ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో దొంగ పనులు చేసి ఉంటే అలాంటి వాటికి బిల్లులు మంజూరు కావన్నారు. తొమ్మిదో వార్డు కౌన్సిలరు శివ రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో కలుషిత జలాలతో అనేక మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారని, తమ వార్డు సమస్య ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. ప్రైవేటు స్థలాల్లో ముళ్ల పొదలు పెరిగి దోమలు, పందులకు ఆవాసాలుగా మారాయని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ప్రైవేటు స్థలాలు గుర్తించి నోటీసులు ఇస్తామని కమిషనర్ వెంకటరామిరెడ్డి సమాధానం ఇచ్చారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రం, వీధి లైట్లు, రోడ్లు వీటిపై మొదటి ప్రాధాన్యంగా గుర్తించి దృష్టిసారించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లకు ఇవ్వనున్న గౌరవ వేతనం పెండింగ్‌లో ఉందన్నారు.

లక్ష్యం చేరని ప్రసవాలపై అసంతృప్తి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైద్యులతో సోమవారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని సమస్యలు, వైద్యులపై వస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే చర్చించినట్లు సమాచారం. కాన్పులు సైతం పూర్తిస్థాయిలో జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆసుపత్రి కోసం మందులు, ఇతర సామగ్రి తమ ట్రస్టు నుంచి ఇస్తున్నా ప్రజల నుంచి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించినట్లు తెలిసింది.



ప్రొద్దుటూరులోని చౌటపల్లెలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, అధికారులు



మైలవరంలో రిబ్బను కత్తిరించి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి



బి.కోడూరులోని తంగేడుపల్లెలో సిమెంటు రహదారికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్ర ప్రగతి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. సోమవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గ మండలాల్లో పల్లె పండగ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ప్రారంభమైంది. అధికారులు, కూటమి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్లెల్లో ప్రజా అవసరాలను గుర్తించారు. రహదారులు అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. బి.కోడూరులోని తంగేడుపల్లెలో రూ.20 లక్షలతో సిమెంటు రహదారి, మినీ గోకులాలకు శంకుస్థాపన చేశారు. మైలవరంలో రూ.కోటితో వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. పోరుమామిళ్ల, ముద్దనూరులో సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. ప్రొద్దుటూరులోని చౌటపల్లెలో రూ.65 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తుందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. **-న్యూస్‌టుడే, క్లస్టరు బృందం**

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే సహించం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పరిసరాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే సహించబోమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శివకుమార్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సుందరయ్య కాలనీలో వారు మాట్లాడుతూ లాటరీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులతో మద్యం అమ్మకాలు చేపట్టడం వల్ల గ్రామాల్లో విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు వెలసే ప్రమాదం ఉందన్నారు. మఠం పవిత్రతను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా గొలుసు దుకాణాలు లేకుండా చేయకుంటే అడ్డుకుంటామన్నారు.

తగ్గనున్న భారం...
గృహిణుల్లో ఆనందం

దీపావళి నుంచి ఉచితంగా ఏడాదికి మూడు వాయుబండలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లోని నాల్గో హామీపై దృష్టిసారించింది. 'ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు' అనే పథకాన్ని ఈ దీపావళి నుంచి అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో జమ్మలమడుగు నియోజకవర్గంలోని గృహిణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.861 ఉండగా కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.47 రాయితీ ఇస్తోంది. నలుగురు లేదా అయిదు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పొదుపుగా వాడినా రెండు నెలలకోసారి ఒక గ్యాస్ బండ ఖర్చు అవుతుంది. ఈ లెక్క ప్రకారం ఏడాదికి ఆరు సిలిండర్లు అవసరం అవుతాయి. ఎర్రగుంట్ల మండలం మినహా జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం, ముద్దనూరులో 27,555 భారత్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం పథకం కింద 7,700, ఉజ్వల 375, పీఎస్ఆర్ 514, జనరల్ 18,966 కనెక్షన్లు ఉన్నాయి.



ఇంటింటికీ డెలివరీ అవుతున్న గ్యాస్ బండలు

హామీ అమలు



చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఇచ్చిన మరొక హామీ నెరవేరుస్తామనడం సంతోషంగా ఉంది. ఈ దీపావళి నుంచి 'ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు' అనే పథకాన్ని వర్తింప చేస్తామనడాన్ని స్వాగతిస్తున్నాం.
-మానస, జమ్మలమడుగు

ఆర్థికంగా వెసులుబాటు



ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే పేద, చిన్న కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరట కలుగుతుంది. దీనివల్ల ఆర్థిక భారం తగ్గుతుంది.
-రామలక్ష్మి, జమ్మలమడుగు

ఏటా రూ.2 వేలకు పైగా ఆదా



ఏటా ఆరు సిలిండర్లు వాడుకుంటే రూ.5,166 వెచ్చించాలి. మూడు గ్యాస్ బండలు ఉచితంగా వర్తిస్తే సుమారు రూ.2 వేలకు పైగా ఆదా అవుతుంది.
-లక్ష్మీదేవి, జమ్మలమడుగు

జమ్మలమడుగులో జడివాన

జమ్మలమడుగు, బద్వేలు న్యూస్‌టుడే: జమ్మలమడుగులో వాన కురుస్తోంది. సోమవారం తెల్లవారుజామున నుంచి జడివాన వదల్లేదు. మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులకు 80742 69513 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. బద్వేల పట్టణంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు సమాచారం తెలిపేందుకు టోల్ ఫ్రీనెంబర్ 6301956870కు సమాచారమివ్వాలని బద్వేలు కమిషనర్ నరసింహారెడ్డి కోరారు.

విద్యార్థినికి సన్మానం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కుట్టు, అల్లిక విభాగంలో విశాఖపట్నంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్న జమ్మలమడుగుకు చెందిన విద్యార్థిని రితికా రెడ్డిని గండికోట ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్‌లోని పెన్షనర్స్ భవనంలో అభినందన సభ ఏర్పాటు చేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవదానం, పెద్దముడియం ఎంఈవో చౌడయ్య, డీవైఎఫ్ఐ శివకుమార్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.60 లక్షలు పుర ఖజానాకు చెల్లింపు

స్పందనకు వందనం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో అనిబిసెంటు ఉన్నతపాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ గుత్తేదారుడు నుంచి సోమవారం రాత్రి రూ.60 లక్షల నగదును వసూలు చేసినట్లు కమిషనర్ వి.మల్లికార్జున 'న్యూస్‌టుడే' తెలిపారు. 'అదనపు వసూళ్లు.. అడ్డుకునే వారెవ్వరూ.?' అనే శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గుత్తేదారు నుంచి నిధులు వసూళ్లకు చర్యలు చేపట్టారు. గతంలో నగదు చెల్లించని గుత్తేదారులకు నోటీసులిస్తామని, స్పందించకుంటే కోర్టులో కేసులు దాఖలు చేస్తామని కమిషనర్ చెప్పారు.

దాడి.. కేసు నమోదు

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపాళెంలో చిత్తా మల్లమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన పి.బాలిరెడ్డితో పాటు పలువురు కొట్టారని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ నెల 10న వ్యక్తిగత కారణాలతో మల్లమ్మపై బాలిరెడ్డితో పాటు మరో అయిదుగురు దాడి చేశారని, ఈ కేసులో అయిదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే మండలంలోని కొండపేటకు చెందిన బసిరెడ్డి వెంకటరెడ్డి అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి దూలం వారిపల్లెకు చెందిన బద్రినాథ్, మహేష్, వెంకటేష్, వినోద్‌తో పాటు మరికొంత మంది దాడి చేశారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

రుణాలివ్వాలంటూ రైతుల ఆందోళన

కొండాపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలోని ఆంధ్ర ప్రగతి రైతుసేవా సహకార సంఘంలో రైతు నేస్తం రుణాలు ఇవ్వడం లేదని కర్షకులు సోమవారం బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రేగడిపల్లె మాజీ సర్పంచి, భాజపా నాయకుడు పీవీ నరసింహారెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలోని రైతులకు రైతు నేస్తం రుణాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములను తనఖా పెట్టు కొన్నప్పటికీ పూచీదారులు లేకుండా రైతులకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. అలాగే పూచీదారులు ఎవరైనా ష్యూరిటీ ఇచ్చి ఉంటే వాళ్లను కూడా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. మూడు నెలలుగా రుణాలివ్వకుండా బ్యాంకు చుట్టూ తిప్పుకొంటున్నారని ఆరోపించారు. వారికి నచ్చినవారికి మాత్రమే రుణం ఇస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై సొసైటీ సీఈవో అంకాలయ్యను వివరణ కోరగా తమ సొసైటీ పరిధిలో రైతుల డిపాజిట్ల డబ్బులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. రైతుల రుణాలు మంజూరుకు సంబంధించి డీసీసీబీ బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.



సొసైటీ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న కర్షకులు

తటాకాలను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

వ్యాధులు ప్రబలుతాయని ప్రజల ఆందోళన ◆ చోద్యం చూస్తున్న అధికారులు



ఉదయగిరి కాలనీ ఖాళీ స్థలంలో పాచిపట్టిన నీరు

– న్యూస్‌టుడే, మైదుకూరు

పరిసరాలు బాగుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ప్రజాప్రతినిధులు.. మైదుకూరు పట్టణంలో పరిసరాల బాగుకు చర్యలు కరవయ్యాయి. చెత్తను ఏరివేస్తున్నాం.. మురుగుకాలువల్లో పూడిక తీస్తున్నామని చెప్పుకోవడం తప్పితే ఆవాసాల మధ్య మురుగు తటాకాలను తలపిస్తున్న ఖాళీ స్థలాల విషయంలో చర్యలు శూన్యం. పందులకు నిలయాలుగా దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. పట్టణంలో సర్వాయపల్లె రోడ్డు, మూలబాట, ఉదయగిరికాలనీ, అరుంధతీనగర్, వినాయక్‌నగర్, బాలాజీనగర్, శ్రీరాంనగర్, ఇలా పలుచోట్ల ప్రైవేట్ యజమానులకు చెందిన స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. ఆవాసాల నుంచి వచ్చే మురుగునీటికి వానాకాలం పరిసర ప్రాంతాల నుంచి చేరే వర్షపునీరు తోడై తటాకాలను తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని.. నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని పూర్వపు కమిషనర్ యజమానులకు నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకోని పక్షంలో పురపాలక ద్వారా ఖాళీ స్థలాల్లో నిల్వ చేరిన నీటిని తోడించి ఆ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. చర్యలకు ఉపక్రమించినా కొనసాగించక పోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మూలబాట నుంచి శ్రీరాంనగర్‌కు వెళ్లేదారిలోని ఖాళీ స్థలం వర్షపు నీరు నిల్వ చేరింది. అక్కడే పశువుల దిబ్బ వేయడంతో పరిసరాలు గగుర్పాటు దారితీస్తున్నాయి. వర్షాకాలంలో పరిసరాలు మరింత అధ్వానంగా మారుతున్నాయి. ఉదయగిరి కాలనీలో ఖాళీ స్థలంలో చేరిన నీరు పాచి పట్టాయి. ఇక్కడే కాదు చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. స్వచ్ఛతా హీ సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మొక్కుబడిగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిసరాల బాగు విషయంలో వార్డు కౌన్సిలర్లు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా మురుగు తటాకాలను తలపిస్తున్న ఖాళీ స్థలాల విషయంలో కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ ఎం. శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దోమల నివారణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



అరుంధతీనగర్ సమీపంలో మురుగు నిల్వలు

రూ.5 కోట్లతో బైపాస్‌రోడ్డు విస్తరణ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మైదుకూరురోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకు నుంచి ఎర్రగుంట్లరోడ్డు బైపాస్‌రోడ్డు కూడలి వరకు నూతన రోడ్డు, విస్తరణ పనులకు రూ.5 కోట్ల నిధులను కలెక్టర్ శివశంకర్ మంజూరు చేశారని ఆర్‌అండ్‌బీ ప్రొద్దుటూరు సబ్ డివిజన్ డీఈ పాలెం లక్ష్మీనరసింహులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జిల్లా మినరల్ రీసోర్స్ పథకం (డీఎంఆర్) కింద ఈ నిధులిచ్చారన్నారు. రెండు కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డులో ఇరువైపులా కలిపి 9 అడుగుల విస్తరణతో పాటు డివైడర్, రెండు కల్వర్టుల నిర్మాణాలు, రోడ్డు ప్రమాద నివారణ నిమిత్తం పనులు చేస్తామని వివరించారు. రోడ్డు విస్తరణ వల్ల ప్రభుత్వ భూమే ఉందన్నారు. ఈ పనులకు టెండర్లను పిలిచినట్లు చెప్పారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పులివెందులలో అత్యవసర కంట్రోల్ రూం ఏర్పాటు

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగితే పరిష్కరించేందుకు వీలుగా మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలతో ఎవరికైనా సమస్యలు ఎదురైతే 70939 17530, 08568-295020 చరవాణి నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే మున్సిపల్ సిబ్బంది సహాయ యంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు ఇళ్లలో విద్యుత్తు, ఇతర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

అన్నదాతల్లో ఆందోళన

కమలాపురం, న్యూస్‌టుడే : వర్షాలతో వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశకు చేరుకుంది. వరి పంట సుమారు 15 నుంచి 20 రోజుల్లో చేతికి అందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజులు వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఎనిమిది వేల హెక్టార్లలో వరి సాగైంది. ఎక్కువగా కూనవరం సన్నాలు, జీలకర వేశారు. పది రోజుల కిందట కురిసిన వర్షాలకు, గాలులకు అక్కడక్కడా వరి నేలకొరిగాయి. ఇప్పుడు మళ్లీ వర్షాలు కురిస్తే ఇంతకాలం అష్టకష్టాలు పడి కాపాడుకున్న పంట దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వరి చేలల్లో నీరు నిలవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వారిని సూచనలు, సలహాలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించామని ఏడీఏ, నరసింహారెడ్డి పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

★ కడప బుగ్గవంక రక్షణ గోడ పక్కనున్న మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన నగరపాలక అధికారులు వ్యర్థాలను తొలగించారు.

★ కడప ఎన్జీవో బంగ్లా ఎదుట ఉన్న అధికారుల నివాసాల చివర కుళాయి గుంత తీసి పూడ్చడం మరిచారని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక ఇంజినీరింగ్ సిబ్బంది పైపు ఏర్పాటు చేసి గుంతను పూడ్చారు. - న్యూస్‌టుడే, కడప(చిన్నచౌకు)

★ కమలాపురం ఎంపీడీవో కాలనీలో రోడ్డు పక్కన చెత్త తొట్టి నిండి కిందపడి దుర్వాసన వస్తోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కమలాపురం

?: కడప రెండో గాంధీ విగ్రహం నుంచి అమ్మవారిశాలకు వెళ్లే దారిలో మసీదు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. - శ్యామ్‌కుమార్, బీకేఎం వీధి, కడప

✓: నగరపాలక సిబ్బందిని పంపించి రోడ్డు పక్కనున్న చెత్తాచెదారాన్ని తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: స్థానిక నాగరాజుపేటలోని శ్రీహరి రావువీధిలో గత రెండు రోజులుగా చెత్త కుప్ప ఉంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. - రమాదేవి, స్థానికురాలు, కడప

✓: ప్రతి రోజూ చెత్తను తీసివేస్తున్నాం. పరిశీలించి చెత్త ఉంటే వెంటనే తొలగిస్తాం. - నవీన్, పారిశుద్ధ్య అధికారి

?: మారుతీనగర్‌లోని కొత్త వెనుకవైపు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల్లో చెత్త నిలిచి ఉంది. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయాలి. - స్థానికులు

✓: పరిశీలించి కాలువలు శుభ్రం చేయిస్తాం. - వార్డు సచివాలయ అధికారి - న్యూస్‌టుడే, మారుతీనగర్

?: మండల పరిధి బూచుపల్లెలో రోడ్డుపై మురుగునీరు ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. - శివశంకర్, స్థానికుడు

✓: పారిశుద్ధ్య పనులు చేపడతాం. సమస్య పరిష్కరిస్తాం. - బాబు, పంచాయతీ అధికారి బూచుపల్లె

?: బొడివారిపల్లెలో పైపులు లీకేజీ అవుతుండటంతో రోడ్డుపై పాచీ పట్టి వృద్ధులు కిందపడుతున్నారు. - మనోజ్ స్థానికుడు

✓: లీకేజీని అరికట్టి, పాచిని తొలగిస్తాం. - రసూల్, పంచాయతీ అధికారి బొడివారిపల్లె - న్యూస్‌టుడే, తొండూరు

మహిళల కంట వెలుగు

★ దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు
★ లక్షల మందికి ప్రయోజనం

న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పలు హామీలు నెరవేర్చిన కూటమి ప్రభుత్వం కీలకమైన మరో పథకం అమలు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో అన్నిరకాల ధరలు పెరుగుతున్నాయి. ఉప్పు, పప్పు నుంచి బియ్యం, గ్యాస్ సిలిండర్ల ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. నెల మారితే పేదలతో పాటు, చిరుద్యోగులు, మధ్య తరగతి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపావళి పండగ ప్రతి ఇంటా సంతోషంగా జరుపుకోవాలన్న సంకల్పంతో ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నారు.

3.60 లక్షల మందికి ఉపయుక్తం

జిల్లా వ్యాప్తంగా దీపం పథకం 3.60 లక్షల మందికి వర్తిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుందని ప్రకటించడంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఒక గ్యాస్ సిలిండర్ ధర రూ.811 ఉంది. నలుగురు సభ్యులున్న కుటుంబంలో ఎంత పొదుపుగా ఉపయోగించినా రెండు నెలలకు మించి ఒక సిలిండర్ కూడా రావడం లేదు. ఈ లెక్కన ప్రకారం ఏడాదికి కనీసం 6 అవసరమవుతాయి. ఇందులో సగం కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. దీంతో ఆయా కుటుంబాలపై ఏడాదికి సరాసరి రూ.2,433 తగ్గనుంది. ఇలా జిల్లాలో సుమారు 3.60 లక్షల మంది ప్రయోజనం కలుగనుందని అధికారులు అంచనా వేశారు. పథకం అమలు, అర్హుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు.


గ్యాస్ సిలిండర్లు తీసుకొస్తున్న దృశ్యం

ఆర్థికభారం తగ్గుతుంది



ఇద్దరం కష్టపడితేనే కుటుంబం సాగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామనడం మాలాంటి పేద, మధ్య తరగతి మహిళలకు వరంగా మారింది. ఏటా కనీసం మూడు వేలు ఖర్చు తగ్గుతుంది. ఇది పేద, మధ్య తరగతి వారికి ఎంతో ఉపయోగం. **- మాధవి, గృహిణి**

గృహిణులకు ఆనందం



ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే ఇంత కంటే ఆనందం మరొకటి ఉండదు. వంటింటి భారం తగ్గుతుంది. గ్యాస్ కోసం వినియోగించే నగదును ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటాం. ఈ పథకం మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. **- సంపూర్ణ, కడప**

ఎంతో మేలు



చంద్రబాబు ఉంటేనే మాకు కొండంత ధైర్యం. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు విషయంలో ప్రతి ఇంటికీ మేలు జరుగుతుంది. ఈ పథకం అమలైతే మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. మేం ఎన్నటికీ ఆయన వెంటే ఉండేలా హామీలు నెరవేరుస్తున్నారు. **- సుశీలమ్మ, దండు హరిజనవాడ, కడప**

ప్రజా సంక్షేమమే లక్ష్యం


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. నగరంలోని బీకేఎం వీధిలో వంకదారి రాము నేతృత్వంలోని పలువురు తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి శ్రీనివాసరెడ్డి, మాధవి పసుపు కండువా వేసి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ వైకాపా పాలనలో ప్రజలు అన్ని రకాలుగా భయపడిపోయారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని, ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. రామ్మూర్తి, రమేష్, సాయికృష్ణ, నరసింహ, బద్రి తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే మాధవి సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి మధ్యాహ్న భోజనం వడ్డించారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

చెన్నూరు, న్యూస్‌టుడే: మండలంలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. కడప-కర్నూలు జాతీయ రహదారి సమీపంలోని మోడాల గ్రామం నుంచి రామనపల్లె వరకు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో దారి సరిగా లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారని, సుమారు రూ.80లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సురేష్ యాదవ్ ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. తెదేపా నాయకులు తాడిగొట్ల సుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వేల్పుల సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కిరణ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు: మండలానికి ఉపాధిహామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపోండు కింద రూ.2.25 కోట్లు నిధులు మంజూరయ్యాయని, వాటితో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.10లక్షలతో వల్లూరు మెయిన్ తారు రహదారి నుంచి కస్తూర్బా పాఠశాల వరకూ నిర్మించనున్న మెటల్‌రోడ్డు పనులను సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కస్తూర్బా పాఠశాలకు బయాలజీ ల్యాబ్ అవసరమని సిబ్బంది తెలపగా, మంజూరయ్యేలా కృషిచేస్తానని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ, ఎంపీడీవో రఘురాం, నజీమున్నీసా, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

చింతకొమ్మదిన్నె: సీకే దిన్నె, నరసన్నపల్లె, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో రూ.30 లక్షలతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు పనులను అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో కుళాయిబాబు, సర్పంచి మహేశ్వర్‌రెడ్డి, పీరుప్రసాద్, నాగేంద్రరెడ్డి, ధర్మారెడ్డి, రాజా, దస్తగిరి, రమణయ్య, మాధవరెడ్డి, గఫూర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల ప్రగతికే పల్లెపండగ


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : గ్రామాల ప్రగతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పల్లెపండగ కార్యక్రమాన్ని చేపట్టిందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. పులివెందుల మండలంలోని ఎర్రిపల్లెలో సోమవారం పల్లెపండగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రూ.5.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు రూ.4,500 కోట్లు కేటాయించిందన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంటురోడ్లు, తారురోడ్ల నిర్మాణం చేపడుతుండడంతో 8 లక్షల కుటుంబాలకు వందరోజుల పని దినాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఈ సుధాకర్ రెడ్డి, పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకట్రామిరెడ్డి, సింహాద్రిపురం తెదేపా మండల బాధ్యుడు జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేముల, న్యూస్‌టుడే : గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వేములలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు.

రాయితీ విత్తనాలు సరఫరా చేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : రబీలో రైతులు పంట సాగు చేసేందుకు వీలుగా రాయితీపై శనగ విత్తనాలు సరఫరా చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో రైతులు శనగ పంట సాగు చేస్తారన్నారు. ఇప్పటికే రబీ ప్రారంభమై రైతులకు విత్తనాల కొరత అధికమైందన్నారు. జిల్లాలో 72,386 క్వింటాళ్ల విత్తనాలు అవసరంకాగా ప్రస్తుతానికి 3,223 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే వచ్చాయన్నారు. ప్రభుత్వం పాతబకాయిలు చెల్లిస్తేనే రైతులకు అవసరమయిన శనగ విత్తనాలు సరఫరా అవుతాయన్నారు.

ఇనుప స్తంభానికి విద్యుత్తు సరఫరా

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే: నగరంలోని 32వ డివిజన్ ఎంఆర్‌బీ వీధిలోని ఇనుప స్తంభానికి విద్యుత్తు సరఫరా అవుతోందని స్థానిక తెలుగుదేశం నాయకుడు విజయ్ ఫిర్యాదు చేయడంతో ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, డీఈ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి వెళ్లి సోమవారం పరిశీలించారు. దీనిని తీసేసి సిమెంటు స్తంభం వేస్తామని పేర్కొన్నారు. వర్షం తగ్గగానే పనులు చేపడతామని, అప్పటి వరకు స్తంభం వద్దకు ఎవరూ వెళ్లకుండా, అక్కడ చెక్కలు అడ్డుపెట్టారు.

సిద్దవటం పరిధిలో రూ.2.18 కోట్ల ఆదాయం

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎనిమిది నూతన మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి రూ.2.18 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ సీఐ రాజశేఖర్ తెలిపారు. సిద్దవటం-5, ఒంటిమిట్ట-2, అట్లూరు-1 దుకాణాలకు మొత్తం 109 దరఖాస్తులు వచ్చాయని, సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణదారులను ఎంపిక పూర్తయిందని చెప్పారు.

పెన్నా తీరంలో అప్రమత్తం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని పెన్నానది తీరంలో ఉండే ప్రజలు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం ఎస్సై చిరంజీవి తెలిపారు. సిద్దవటంలోని పెన్నా లోలెవెల్ కాజ్‌వే వద్దకు, గ్రామీణ ప్రజలు నది వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

బాధితునికి పరామర్శ

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత లింగమూర్తి ఎంతో ఆదర్శమని కడప శాసనసభ్యురాలు మాధవి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయనను సోమవారం వారు పరామర్శించారు.

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు


లోహియా నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో కడపలో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తారు కురిసింది. నగరంలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిల్వ ఉన్న నీటిని బయటికి పంపించేందుకు ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేసిన మోటారు పని చేయకపోవడంతో ఇక్కట్లు తప్పలేదు. నగర శివారులోని పలు లోతట్టు రోడ్లపైకి వర్షం నీరు చేరడంతో రాకపోకలకు నగరవాసులు అవస్థలు ఎదుర్కొన్నారు.

సిద్దవటం : సిద్దవటం దిగువపేటలోని ప్రధాన రహదారి సోమవారం కురిసిన వర్షానికి జలమయమైంది. దిగువపేటలోని గూడూరు ఓబయ్య హోటల్ వద్ద నుంచి గాంధీవీధి బస్టాప్ వరకు నీరు నిలిచి అధ్వానంగా మారడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

వసతిగృహ విద్యార్థుల తరలింపు

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల వద్ద గల ఎస్సీ వసతి గృహం చుట్టూ నీరు చేరింది. పాఠశాల ఆటస్థలం జలమయమైంది. గాలేరు-నగరి కాలువ నుంచి వదలిన నీటితో పాటు వర్షం కురుస్తుండటంతో ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో పాఠశాల అధినేత సుబ్బానాయుడు ఆదేశాల మేరకు డిగ్రీ కళాశాలలోకి అక్కడి విద్యార్థులను సంక్షేమశాఖాధికారి తరలించారు.


వర్షానికి జలమయమైన కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం


వీరపునాయునిపల్లె: వసతి గృహం చుట్టూ చేరిన నీరు

ఘర్షణపై కేసుల నమోదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో జరిగిన గొడవ ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈనెల 13న బాలాజీపేటలో ఆయుధ పూజ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో పలువురు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు: కడప మండలం చెన్నప్పరెడ్డిపల్లెకు చెందిన శివకాశిరెడ్డి (25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయన సోమవారం ద్విచక్రవాహనంపై కడప నుంచి బెంగళూరుకు వెళ్తుండగా కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద కారు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏటీఎం కేంద్రంలో విద్యుత్తు సౌకర్యం

స్పందనకు వందనం

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పట్టణం పాత గంగిరెడ్డి ఆసుపత్రి సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో బ్యాంకు అధికారులు సోమవారం విద్యుత్తు సౌకర్యం కల్పించారు. మూడునెలలుగా ఈ కేంద్రంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో సోమవారం ఈనాడులో 'అంధకారంలో ఏటీఎం కేంద్రం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన బ్యాంకు అధికారులు కేంద్రంలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కేంద్రంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. దీంతో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చోరీ కేసులో మరొకరి అరెస్టు

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పట్టణం కదిరి రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో అగస్టు 13న జరిగిన చోరీ కేసులో మరో నిందితుడు అలెగ్జాండర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. సురేష్‌కుమార్, అలెగ్జాండర్ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ కేసులో ఇప్పటికే సురేష్‌కుమార్‌ను అరెస్టు చేశామన్నారు. అలెగ్జాండర్ వద్ద రూ.లక్ష నగదు రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణ, హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరులో వరుస చోరీలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఒకే దుకాణంలో గత ఏడాదిన్నర కాలంలో ఏకంగా ఐదు సార్లు చోరీకి పాల్పడ్డారు. తాజాగా ఆదివారం రాత్రి మరో సారి చోరీ జరిగింది. రూ.20 వేలు నగదు, నాలుగు చరవాణులు పోయినట్లు బాధితుడు గంగిరెడ్డి చెప్పారు.

రామాలయానికి దూరంగా మద్యం దుకాణాలు పెట్టండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయానికి సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయరాదని సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు సోమవారం వినతి పత్రం పంపినట్లు తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలిరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

లింగాల: పార్నపల్లెలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు రామడుగు రాజశేఖరశాస్త్రి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, గణపతి పూజ నిర్వహించారు.

మరుగుదొడ్డి లేక... అవస్థలు తప్పక



మండల పరిధి ఇనగలూరులోని ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్డి అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా పనులు చేపట్టి నిధుల కొరతతో మధ్యలోనే వదిలేశారు. ఈ విషయమై మండల విద్యాధికారిణి భారతిని వివరణ కోరగా మన బడి, మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పనులు ప్రారంభించి మురుగుదొడ్డిని పూర్తి చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, తొండూరు**

రోడ్లు అధ్వానం... ప్రయాణం నరకప్రాయం

చెన్నూరు, కమలాపురం, న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో అంతులేని అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో కమలాపురం నియోజకవర్గంలోని రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు వర్షాలకు మరింత అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. రోడ్డేదో..గుంతేదో తెలియక వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని గత అయిదేళ్ల పాటు ప్రజలు పలు విన్నపాలు చేసినా వైకాపా నాయకులు పట్టించుకోలేదు. దీంతో అధ్వాన రోడ్లపై అవస్థలు పడుతూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా నాయకులు తాము నివాసం ఉండే ప్రాంతాలకు నిధులు వెచ్చించి రోడ్లు వేయించుకున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారులను పట్టించుకోలేదు. చిన్న చిన్న మరమ్మతులు చేయించి చేతులు దులుపుకొన్నారు. కొన్ని కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు.


వై.కొత్తపల్లె ఎస్సీ కాలనీ వద్ద రహదారిపై గుంతల్లో నిలిచిన నీరు

◆ కమలాపురం మండలంలో చిన్నచెప్పలి నుంచి నసంతపురం మీదుగా లేటపల్లె, ఎర్రబల్లె వరకు సుమారు 4 కి.మీ దారి అధ్వానంగా ఉంది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇదే మార్గంలో వై.కొత్తపల్లె ఎస్సీ కాలనీ వద్ద గుంతల్లో నీరు నిలవడంతో కాలనీలోని పిల్లలు, వృద్ధులు బయటకు రాలేకపోతున్నారు. ఇదే మార్గం మీదుగా వీఎన్‌పల్లెలోని ప్రముఖ శివాలయానికి భక్తులు వెళుతుంటారు. గుంతలు, బురదతో ఆలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబటూరు నుంచి విభరాపురం వరకు సుమారు 3 కి.మీ మేర మూడేళ్ల కిందట కంకర పరిచి నిధుల లేమితో వదిలేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొండాయపల్లె వద్ద ఉన్న కాశినాయన ఆలయం నుంచి పెద్దచెప్పలికి వెళ్లే మార్గంలో పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పశువుల ఆసుపత్రి నుంచి ఎల్లారెడ్డిపల్లె, చెన్నారెడ్డిపల్లె వరకు గ్రావెల్ పరిచి వదిలేయడంతో ప్రజలు నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కంపేట నుంచి మీరాపురానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. రాళ్లు తేలడంతో నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వీఎన్‌పల్లె మండలంలోని రాజుపాలెం నుంచి గోనుమాకులపల్లె వరకు, అయ్యవారిపల్లె నుంచి ఇందుకూరు వరకు, ఉరుటూరు నుంచి తలపనూరు వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఓబులవారిపల్లె నుంచి వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రోడ్డు కలిసే వరకు రోడ్డు దెబ్బతినడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

◆ వల్లూరు నుంచి లింగాయపల్లె, బాలుగారిపల్లె నుంచి పుల్లారెడ్డిపేట వరకు, కడప, తాడిపత్రి జాతీయ రహదారిలోని ఈత చెట్టు నుంచి పెద్దలేబాక గ్రామాలకు వెళ్లే దారి అధ్వానంగా మారింది.

◆ సీకేదిన్నె మండలం వలయ రహదారిలోని మామిళ్లపల్లె వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

◆ చెన్నూరు నుంచి కొక్కరాయపల్లెకు వెళ్లే రహదారి పూర్తిగా బురదమయమైంది. చిన్నపాటి వర్షం కురిస్తే ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా.. నిధులు మంజూరు కాగానే రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.